విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం

- నిషేధం విధించినా పట్టనట్టు వ్యవహరిస్తున్న వైనం
- సంబంధిత అధికారుల చర్యలు శూన్యం


ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ అధికారులు (ఫైల్)


సత్యసాయి కాలనీలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వర్థ్యాలు

నారాయణపేట టౌన్ : సమస్త జీవరాశులకు ముప్పు వాటిల్లుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్లాస్టిక్‌పై నిషేధం విధించింది. కానీ క్షేత్రస్థాయిలో కొందరు అధికారుల నిర్లక్ష్యంతో నిషేధం అమలు కావడం లేదు. ముఖ్యంగా నారాయణపేటలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తున్నారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ప్లాస్టిక్ వినియోగంలో ఎలాంటి మార్పు రాలేదు. యథావిధిగా వినియోగదారులకు వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లలోనే సామగ్రి అందిస్తున్నారు. అధికారులు చేపట్టే నామ మాత్రపు తనిఖీలు దీనిపై ఎలాంటి ప్రభావం చూపడం లేదని స్థానికులు అంటున్నారు. గతంలో మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ కవర్లపై నిషేధం విధించిన తరువాత కొద్దిరోజుల పాటు బాగానే చర్యలు తీసుకున్నారు. కొంతకాలం హడావుడి చేసి తనిఖీలు చేపట్టారు. పట్టుబడిన వారికి రూ. 5 వేల వరకు జరిమానాలు కూడా విధించారు. కానీ ప్రస్తుతం పరిస్థితి మొదకొచ్చింది. దుకాణాదారులు ప్లాస్టిక్ సంచులను వినియోగించడం ప్రారంభించారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కూరగాయల వ్యాపారులు, సూపర్ మార్కెట్లు, మటన్, చికెన్ సెంటర్ల నిర్వాహకులు ప్లాస్టిక్ కవర్లలోనే సామగ్రి తదితరాలు వేసి వినియోగదారులకు ఇస్తున్నారు. వినియోగదారులు సైతం ఆ కవర్లను డ్రెయినేజీలలో ఇష్టానుసారం వేస్తున్నారని మున్సిపల్ కార్మికులు చెబుతున్నారు. అధికారులు పూర్తి స్థాయిలో నిషేధించేందుకు తనిఖీలు చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పాఠశాల వార్షికోత్సవం

ఊట్కూరు: మండల పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం రాత్రి ఘనంగా వార్షికోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఈ సందర్భంగా ఏకపాత్రాభినయాలు, డ్యాన్స్‌లు, నాటికలతో ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా సర్పంచ్ మాణిక్యమ్మ హాజరై మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా వార్షికోత్సవం నిర్వహించడం అభినందనీయం అన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు నర్సింగప్ప, నోడల్ ఆఫీసర్ సురేష్‌కుమార్, ఉపసర్పంచ్ బాలస్వామి, ఉపాధ్యాయులు నరసింహ, కృష్ణ, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నృత్యాలు చేస్తున్న చిన్నారులు

క్లుప్తంగా

కలుషిత నీరు సరఫరా!

నారాయణపేట రూరల్ : మండలంలోని బొమ్మన్‌పాడులో కొద్దిరోజులుగా కొళాయి ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నెలల తరబడి వాటర్‌ట్యాంకు శుభ్రం చేయకపోవడంతో డ్రెయినేజీ నీరులాగా వస్తున్నాయని వాపోయారు. ఎన్నిసార్లు విన్నవించినా పంచాయతీ పాలకులు, అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. వెంటనే ట్యాంకు శుభ్రం చేయాలని, లేకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

మంత్రికి పరామర్శ



నర్వ: వ్యవసాయశాఖమాత్యులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లో నర్వ పీఏసీఎస్ చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి కలిసి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ అభివృద్ధికి కృషిచేయాలని మంత్రిని కోరినట్లు పేర్కొన్నారు. నాయకులు లంకాల్ జనార్దన్, అజిత్ సింహా రెడ్డి తదితరులున్నారు.

'ప్రశ్నించే గొంతుకకు మద్దతు పలుకుదాం'



నారాయణపేట రూరల్ : ఏళ్ల తరబడి పేరుకుపోయిన విద్యారంగ సమస్యల సాధనకు మండలిలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుక మద్దతు ఇద్దామని తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేర్‌కృష్ణారెడ్డి, నర్సింహులు పిలుపునిచ్చారు. పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి ఏవీఎన్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా తపస్ ఉద్యమాన్ని నమ్ముకుని పనిచేస్తుందని, ఎన్నో రకాల ఫలాలు ఉపాధ్యాయులకు సిద్ధించడలో తపస్ పాత్ర ఎంతో కీలకమైందన్నారు. కార్యక్రమంలో గుంపుబాలరాజు, దూససీతారాములు పాల్గొన్నారు.

పట్టభద్రులకు తపాలా జీవిత బీమా

మద్దూరు: తపాలా జీవిత బీమా పథకం ఇక నుంచి పట్టభద్రులకు, డిప్లొమా పూర్తి చేసిన వారికి వర్తిస్తుందనినారాయణపేట సబ్ డివిజన్ సహాయ పర్యవేక్షకులు రవికుమార్ తెలిపారు. శనివారం మండలంలోని పోస్టాఫీస్ కార్యాలయంలో తపాలా సిబ్బందితో ఈ పథకానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. పాలసీని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తపాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు రెగ్యులర్ చెకప్ చేయించుకోవాలి



నారాయణపేట రూరల్ : పోలీసులకు ఆరోగ్యం ఎంతో ముఖ్యమైందని, ప్రతి ఒక్కరు రెగ్యులర్‌గా హెల్త్ చెకప్ చేయించుకోవాలని డీఎస్పీ కే.సత్యనారాయణ అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ మైదానంలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు వీక్లీ పరేడ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐలు డేవిడ్, కృష్ణయ్య, విజయ్, ఆర్ఎస్ఐలు ఇందిర, శివశంకర్, రిజర్వుడ్ పోలీసులు పాల్గొన్నారు.

శాంతియుతంగా నడుచుకోవాలి



మక్తల్: గ్రామాల్లో ప్రజలందరు శాంతి యుతంగా ఉండాలని నారాయణపేట జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. మంతన్‌గోడ్‌లో ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. రాబోయే ఎన్నికలు, పండుగలు తదితర కార్యక్రమాల్లో శాంతియుతంగా నడుచుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్దత సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీఐ రామ్‌లాల్, మక్తల్ ఎస్ఐ పర్వతాలు, సర్పంచ్ దాసరి మహదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

నగర సంకీర్తన

స్టేషన్ మహబూబ్‌నగర్: ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శనివారం వైభవంగా గౌరిపూర్ణిమ మహోత్సవం నిర్వహించారు. పద్మావతీకాలనీ శ్రీకృష్ణ కమాన్ నుంచి ప్రారంభమైన నగర సంకీర్తన లక్ష్మీనగర్‌కాలనీ, వెంకటేశ్వరకాలనీ, మెట్టుగడ్డ, టీచర్స్‌కాలనీ రామాలయం వరకు నిర్వహించారు.

పెండింగ్ చలాన్లు క్లియర్ చేసుకోవాలి


వాహనదారులతో మాట్లాడుతున్న పోలీసులు

నారాయణపేట రూరల్ : పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పోలీసులు వాహనాలకు సంబంధించిన పెండింగ్ చలాన్ల వసూలు చేపట్టారు. హెడ్ కానిస్టేబుల్ కతలప్ప ఆధ్వర్యంలో ద్విచక్రవాహనాల నుంచి భారీ వాహనాల వరకు అన్నింటిని పరిశీలించి పెండింగ్ చలాన్లు ఉన్నవారికి క్లియర్ చేసుకోవాలని సూచించారు. కాగా 37 కేసులకు సంబంధించి రూ. 7785ల వసూలు అయ్యాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపడంతో చలాన్లు కట్టాల్సి వస్తుందని, ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, హెల్మెట్, సీటుబెల్టు తప్పని సరిగా ధరించాలన్నారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణం చేయరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని అన్నారు. రాత్రిసమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు శివ, రవి, సంతోష్, జయప్రకాష్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం



మద్దూరు: టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆదేశాల మేరకు శనివారం ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని మద్దూరు, దోరేపల్లి, ఎర్రకుంటతండా, భీంపూర్, అప్పిరెడ్డిపల్లి, అచ్చంపల్లి, చెన్నారం భూనీడ్, నిడ్జింత గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించారు. పార్టీ కొడంగల్ కో ఆర్డినేటర్ వెంకటప్రసాద్ తెలంగాణలో పార్టీకి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యమన్నారు. నాయకులు రవి, రవీందర్‌రెడ్డి, సాయప్ప, రాములు, మల్లేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించారు


పాదయాత్రలో కాంగ్రెస్ నాయకులు

కోస్గి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. కోట్లు అప్పులు చేస్తూ ప్రజా సంక్షేమాన్ని విస్మరించాయని టీపీసీసీ సభ్యులు వార్ల విజయ్ కుమార్ అన్నారు. మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన 'హాథ్ సే హాథ్ జోడో యాత్ర' శనివారం మండల పరిధిలోని ముశ్రీఫాలో కొనసాగిన సందర్భంగా మాట్లాడారు. మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'పీఆర్‌టీయూతోనే సమస్యల పరిష్కారం'


మరికల్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : నాటి నుంచి నేటి వరకు విద్యారంగ అభివృద్ధికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి చేస్తోందని, సంఘం బలపర్చిన అభ్యర్థిని మండలికి పంపిస్తే టీచర్లకు మేలు జరుగుతుందని జిల్లా ప్రధాన కార్యదర్శి యాద్గీర్ జనార్దన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో ఉపాధ్యాయుల ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు లక్ష్మారెడ్డి, ఆసీఫాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్‌రావు, శంకర్, స్థానిక నాయకులు రఘువీర్, శివకుమార్, నర్సింగ్‌రావు, శివరాములు, యూనస్, ఫజల్ పాల్గొన్నారు.

మరికల్: పీఆర్‌టీయూ సంఘంతోనే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారమవుతాయని జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం మరికల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పీఆర్‌టీయూ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి ఓటు వేయాలని సూచించారు. నాయకులు పాల్గొన్నారు.

గుంతలమయంగా బీటీరోడ్లు


అధ్వానంగా మారిన జక్లేర్ రోడ్డు

మక్తల్: మండలంలోని పలుగ్రామాలకు వెళ్లే బీటీరోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా జక్లేర్ చెరువు కట్టపై బీటీ రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. రాత్రి సమయంలో ఈ దారిలో వెళ్లాలంటే భయంగా ఉంటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. విషయంపై పలుమార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా డోలారోహణ



మాగనూర్: మండల పరిధిలోని నెరడగంలో జరుగుతున్న శ్రీ సిద్ధలింగ మహాస్వాముల మఠం జాతరలో భాగంగా చివరి రోజు డోలారోహణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పల్లకీసేవ అంగరంగ వైభవంగా చేపట్టారు. మఠాధిపతి సిద్ధలింగ మహాస్వాములను ఊయలలో ఉంచి శ్రీ సిద్ధలింగేశ్వరగా నామకరణం చేశారు. అనంతరం ప్రత్యేకపూజలు చేశారు.

ముళ్లపొదలు తొలగించండి


బంగారు బాలప్పహిల్స్ కాలనీలో పెరిగిపోయిన ముళ్లపొదలు

నారాయణపేట టౌన్ : పట్టణంలోని 1వ వార్డు పరిధిలోని బంగారు బాలప్ప హిల్స్ కాలనీలో ముళ్లపొదలు విపరీతంగా పెరిగిపోవడంతో రాత్రి, పగలు తేడా లేకుండా పాములు, విషపురుగులు తిరుగుతున్నాయని కాలనీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి వసతులు లేని ఈ కాలనీలో ఉంటూ అవస్థలు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్కడక్కడ డ్రెయినేజీలు నిర్మించినప్పటికీ వాటిపై ముళ్లపొదలు అడ్డంగా ఉండటంతో మున్సిపల్ కార్మికులు మురుగు కూడా తొలగించడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే పెరిగిపోయిన ముళ్ల పొదలను తొలగించి హరిత హారం మొక్కలు నాటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

దేశభక్తి పెంపొందించేందుకు కృషి


సమ్మేళనానికి హాజరైన సంఘ్ కార్యకర్తలు


మాట్లాడుతున్న రవికుమార్

మక్తల్: ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు సంఘ్ కార్యకర్తలు నిరంతరం శ్రమిస్తుంటారని ఆర్ఎస్ఎస్ పాలమూరు విభాగ్ కార్యవాహ పత్తికొండ రాము, ఉందేకోడ్ రవికుమార్‌లు అన్నారు. శనివారం పట్టణంలో నిర్వహించిన అఖండ సమ్మేళనంలో పాల్గొన్నారు. అంతకుముందు పురవీధుల గుండ ర్యాలీ నిర్వహించారు. ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు కొండయ్య, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



మాగనూర్(కృష్ణ): మండల పరిధిలోని గూడెబల్లూరు గ్రామ పంచాయతీ టైరోడ్ వద్ద ఉన్న లిటిల్ ఏంజెల్ పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


చేగుంటలో పూజలు చేసి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్, తదితరులు

మక్తల్: పట్టణంలోని తొమ్మిదో వార్డులో సీసీ రోడ్డు పనులను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి శనివారం ప్రారంభించారు. రూ.80 లక్షలతో పనులు చేస్తున్నామన్నారు. వార్డు ప్రజలు సహకరించాలని కోరారు. కాంగ్రెస్ నాయకుడు శేషగిరి, బీఆర్ఎస్ నాయకులు శివారెడ్డి, పద్మమ్మ, వెంకటయ్య, అంజనేయులు, పాల్గొన్నారు.

మాగనూర్(కృష్ణ): గ్రామాల్లో అంతర్గత రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ప్రభుత్వం కనికరం చూపించిందని కృష్ణ మండలం చేగుంట గ్రామ సర్పంచ్ శివప్ప అన్నారు. గ్రామంలో ఎన్ఆర్‌జీఎస్ నిధుల నుంచి మంజూరైన రూ. 15.80 లక్షలతో నూతన సీసీ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు గ్రామాల్లో పారిశుద్ధ్యం సమస్య కూడా తొలగిపోతుందని అన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు


ధ్వంసమైన ఊటకుంట కట్ట

మరికల్: మండలంలోని ఎలిగండ్ల గ్రామానికి చెందిన ఊటకుంట ఆనకట్టను కొందరు కబ్జాదారులు ధ్వంసం చేసి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ బోర్లలో నీటిమట్టం పెంచేందుకు ఏర్పాటు చేసిన ఊటకుంట కట్టను వారం రోజుల నుంచి రాత్రి సమయంలో జేసీబీల సాయంతో తవ్వుతున్నారని చెబుతున్నారు. మట్టిని ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని వాపోతున్నారు. దీంతో కుంటలో నీరు నిల్వ ఉండే అవకాశం లేకుండా పోయిందని అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేనిపక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

ముగిసిన యోగా మహోత్సవాలు



నర్వ: మండలంలోని కల్వాల్ గ్రామంలో మూడు రోజులుగా హార్ట్‌ఫుల్ సంస్థ నిర్వహించిన యోగా మహోత్సవాలు శనివారం రాత్రి ముగిసాయి. ఈ సందర్భంగా 30 ఏళ్లుగా యోగా సాధన చేస్తున్న ఉంద్యాల సత్యనారాయణరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగసాధనతో ఒత్తిడి తొలగిపోయి ప్రశాంతత ఏర్పడి తద్వారా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, పెంచుకోవచ్చన్నారు. మనిషి సంపూర్ణ ఆరోగ్యానికి యోగ సాధన ఎంతో అవసరమన్నారు. ధ్యానంతో పాటు ఆధ్యాత్మిక చింతన కూడా అలవాటు చేసుకుంటే మనిషి ఆరోగ్యంతో పాటు ఆనందంగా జీవించగలడన్నారు. కార్యక్రమంలో శివకుమార్, వడ్డే ఆనంద్, యాంకి మల్లేష్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, ఎల్లారెడ్డి, యాంకి కృష్ణ, వెంకటయ్య పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దామరగిద్ద: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్న ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. వారు తెలిపిన వివరాల ఎస్ఐ శ్రీనివాస్ రావ్ కథనం ప్రకారం నారాయణపేట మండలం పేరపళ్ల తండాకు వాసి అయిన రవికి చెందిన ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో శుక్రవారం రాత్రి పెట్రోలింగ్‌లో ఉన్న పోలీస్ సిబ్బంది తెల్లవారు జామున 4 గంటలకు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను వత్తుగుండ్ల సమీపంలో పట్టుకున్నారు. ఈ క్రమంలో డ్రైవర్ పరారు కాగా పోలీసులు ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. యజమాని రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బండి సంజయ్‌ని అరెస్ట్ చేయాలి


మరికల్‌లో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, తదితరులు


ధన్వాడలో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : తెలంగాణ సంస్కారాన్ని మంట గలుపుతూ ఆడపిల్లలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మున్సిపల్ చైర్ పర్సన్ గందె అనసూయ, జెడ్పీటీసీ అంజలి విమర్శించారు.ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ శనివారం పట్టణ, మండల పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. గందె చంద్రకాంత్, రాములు, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

మరికల్: ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖలు చేసిన రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జెడ్పీవైస్ చైర్ పర్సన్ సురేఖ, రాజవర్ధన్‌రెడ్డి, బసంత్, రామస్వామి, గోవర్ధన్, శేఖర్, ఉస్సేన్. హన్మిరెడ్డి, సతీష్, గోపాల్ పాల్గొన్నారు.

దామరగిద్ద: ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సంజయ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో శనివారం రాస్తారోకో చేశారు. ఎంపీపీ నర్సప్ప, విండో అధ్యక్షుడు ఈదప్ప, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు భీమయ్యగౌడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మద్దెల్‌బీడ్ సర్పంచ్ వెంకటప్ప పాల్గొన్నారు.

మాగనూర్(కృష్ణ): బీజేపీ కుట్ర పూరిత చర్యలో భాగంగానే లిక్కర్ కుంభకోణం పేరిట ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఇబ్బందులు పెడుతున్నారని గూడెబల్లూర్ మాజీ సర్పంచ్ అమరేష్ అన్నారు. శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు

ధన్వాడ: బండి సంజయ్‌పై ధన్వాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యువజన సంఘం అధ్యక్షుడు సునీల్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కొండారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాల కంపౌండ్ గోడలకు రంధ్రాలు

అమరచింత: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల కంపౌండ్ గోడలను గుర్తుతెలియని వ్యక్తులు కూలగొడుతున్న సంబంధింత అధికారులు పట్టించుకోకపోవడంతో పాఠశాల మైదానాల్లో అసాంఘిక కార్యక్రమాలు పెరిగిపోయాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. పక్షం రోజుల కిందట జెడ్పీఉన్నత పాఠశాల కంపౌండ్ వాల్‌కు రంధ్రం వేసిన గుర్తుతెలియని యువకులు దాన్ని మరింతగా కూల్చి ఎకంగా పాఠశాల మైదానం వెంట రహదారిని ఏర్పాటు చేసుకున్నారు. వీటి వ్యవహారంలో అధికారులు మిన్నకుండా ఉండడంతో పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన కంపౌండ్ వాల్‌ను కూలగొట్టారు. రాత్రి వేలల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించకపోవడం, పాఠశాల మైదానాల్లో అర్ధరాత్రి వరకు ఉండే వారిని ఎందుకు ఉన్నారని ప్రశ్నించే వారు లేకపోవడంతో పాఠశాలల కంపౌండ్ వాళ్లు ధ్వంసం అవుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.